Page No. 1 - Green Page No. 1 - Red Page No. 1 Black

ఆర్ డి టి

ఎకాలజీ సెంటర్, అనంతపురం.

ఈ మాసపు సమాచారం జూన్ 2005

FOR PRIVATE CIRCULATION ONLY

## మీకు తెలుసా !

నేలలకు హానిచేసే రసాయనాలు విచక్షణారహితంగా పంటలపై పిచికారి చేసినప్పుడు, పురుగుమందుల మోతాదు ఎక్కువైనప్పుడు జిల్లేడు మొక్కలు వాలిపోతూ ఉంటాయి. దీనిని ప్రమాద సూచికగా గుర్తించి పొలంలో రసాయన మందులు పూర్తిగా నియంత్రించి, సేంద్రీయ ఎరువులు, వృక్షసంబంధమైన పురుగుమందులను వాడటం శ్రేయస్కరం అని గుర్తించాలి.

**(అన్నదాత – మే, 2005)**

అమెరికాలోని కాలిఫోర్నియా యూనివర్సిటీ వారు పండ్లతొక్కలలో శరీరానికి ఉపయోగపడే పోషక పదార్థాలున్నాయని కనుగొన్నారు. తెల్లటి బియ్యానికి బదులు, తవుడు పొరతోవున్న ముతక బియ్యం తినమని వారు సిఫారసు చేస్తున్నారు. అలాగే కందులు, పెసలు, అలసందలు లాంటి పప్పుధాన్యాలను పై పొట్టు తీయకుండా వాడాలి. ఆలుగడ్డలు, గుమ్మడికాయలు, క్యారెట్‌లాంటి దుంపలను పై పొర తీయకుండానే వాడాలి. సీజన్‌లో దొరికే మామిడి పళ్ళు కూడా బాగా కడిగి తొక్కతోనే తింటే మంచి పోషకాలు లభ్యమవుతాయి. నిమ్మ, నారింజ తొక్కలు ఎండబెట్టి పొడిచేసి దానితో పళ్ళు తోముకుంటే పళ్ళు తెల్లగా మెరుస్తాయి. అలాగే తొక్కలు మరెన్నోరకాలుగా ఉపయోగపడ్తాయి.

**(డౌన్ టు ఎర్త్, ఏప్రిల్ 30, 2005)**

ప్రపంచంలోని అన్ని దేశాలలోకంటే మనదేశంలో అల్జీమర్స్ వ్యాధి తక్కువగా ఉండటానికి కారణం మనం వంటకాల్లో పసుపు ఎక్కువగా వాడుతుండటమే అని అమెరికాలోని కాలిఫోర్నియా యూనివర్సిటీ శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. అల్జీమర్స్ వ్యాధివల్ల మెదడులో కణాలు చనిపోయి జ్ఞాపకశక్తి, అలోచనా శక్తి తగ్గిపోవడం లాంటివి సంభవిస్తాయి. పసుపు రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుందని కూడా పేర్కొన్నారు. కాబట్టి పసుపును మనం మరింత ఎక్కువగా ఉపయోగిద్దామా?

**(డౌన్ టు ఎర్త్, ఏప్రిల్ 15, 2005)**

### చిట్కా :

★ **కాకరాకు రసం, వేపాకు రసం, బాగాపండిన నిమ్మరసం కలిపి టేబుల్ స్పూన్ల పరిమాణంలో చిన్న పిల్లలకు త్రాగిస్తే మశూచి, తట్టువంటి వ్యాధులు నయమవుతాయి. ఇవి ప్రబలిన ప్రాంతంలో పిల్లలకు ముందుగా వారానికి ఒకసారి తాగిస్తే వ్యాధి నిరోధకంగా పనిచేస్తాయి.**

## గ్రామాభివృద్ధి కమిటీలు, వాటర్‌షెడ్ కమిటీలు, గ్రామైక్య సంఘాలు - గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కోసం శ్రమించాలి.

గ్రామాలలో అనేక సమస్యలు ఉంటున్నాయి. సౌకర్యాలు కొరవడినాయి. గ్రామాలలో అనేక సంస్థలు గ్రామ ప్రజలకు సేవచేయడానికి స్థాపించినా, చాలా చోట్ల అవి సమర్థవంతంగా ప్రజలకు సేవలందించడంలేదు. ఆ సంస్థలకు గ్రామ ప్రజల నుండి కూడా తగినంత సహకారం, ప్రోత్సాహం లభించడంలేదు. గ్రామాలలోవున్న సంస్థలు – గ్రామ పంచాయితీ, గ్రామ సెక్రటరీ, అంగన్‌వాడీ కేంద్రం, బాలవాడి కేంద్రం, నీటి వినియోగదారుల సంఘం, పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశువైద్య కేంద్రం, బ్యాంకులు, వ్యవసాయ విస్తరణ కార్యాలయం, ఉద్యానవన కార్యాలయం, తదితర సంస్థలన్నీ కూడా గ్రామ ప్రజలకు సేవలందించడానికి ప్రభుత్వాలు ఏర్పాటు చేసినవి. ఈ సంస్థలు ప్రజలకు మంచి సేవలందించాలంటే ప్రజల నుండి సహకారం, ప్రోత్సాహం, జవాబుదారీతనం చాలా అవసరం. ఆ సంస్థల నుండి సేవలను వినియోగించుకోవడానికి ప్రజలు ఒక పద్ధతి ప్రకారం సమాయత్తం కావాలి.

కళ్యాణదుర్గం, బెళుగుప్ప, శెట్టూరు, కుందుర్పి, కంబదూరు మండలాలలోని కొన్ని వాటర్‌షెడ్ గ్రామాలలో బ్యాంకులనుండి మంచి సేవలను అందుకొంటున్నారు. ఉదా:– రుద్రంపల్లి, కంబాలపల్లి గ్రామాలలో గ్రామాభివృద్ధి కమిటీ, వాటర్‌షెడ్ కమిటీ, గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో ప్రజలను సమాయత్తం చేసి, బ్యాంకుకు అప్పులు సకాలంలో కట్టించినారు. అలాగే బ్యాంకు మేనేజర్లతో చర్చించి, గ్రామంలోని అందరు రైతులకూ సకాలంలో పంట అప్పులు సాధించుకొన్నారు. ఇది ఎంతో ప్రశంసించదగ్గ విషయం. అన్ని వాటర్‌షెడ్ గ్రామాలు ఈ విధంగా అప్పులు కట్టించి, తిరిగి సకాలంలో అందరికీ తగినంత అప్పు దొరికేటట్లు కృషిచేయవచ్చును. అలాగే ఇతర సంస్థలపైనా దృష్టిపెట్టవలెను. ఆ సంస్థల పనితీరును పరిశీలించవలెను. ప్రతి సంస్థ ఏ స్థాయిలో ప్రజలకు సేవలందించుచున్నదీ విశ్లేషించవలెను. ఇంకా మెరుగైన సేవలందించాలంటే ఇటు ప్రజల నుండి, అటు అధికారుల నుండి ఎటువంటి సహకారం, సదుపాయాలు అవసరమో గుర్తించాలి. ఆ విధంగా ప్రజల నుండి తగిన ప్రోత్సాహం, సహకారం, సదుపాయాలను అధికారులకు అందించాలి. ప్రజల నుండి అధికారలుకు ఇబ్బంది లేనట్లు, అలాగే అధికారులనుండి ప్రజలకు ఇబ్బంది లేనట్లు సేవలను అందించాలి. ఏవైనా సమస్యలు వస్తే సామరస్యంగా చర్చించి, పరిష్కరించుకోవాలి.

కొంతమంది బ్యాంకు అధికారులు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు పెట్టుకొని బ్రోకర్లను, ఏజంట్లను దగ్గరకు రానీయకుండా రైతులకు సేవలందిస్తున్నారు. మరికొంతమంది అధికారులు బ్రోకర్లకు, ఏజెంట్లకు స్థానమిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అటువంటి పరిస్థితులున్న బ్యాంకులలో గ్రామకమిటీలు చొరవ తీసుకొని ప్రత్యక్షంగా బ్యాంకు అధికారులను కలిసి, అవినీతికి తావులేని విధంగా, అందరికీ అప్పు సకాలంలో అదే విధంగా మరియు తీసుకొన్న అప్పును తిరిగి సకాలంలో అందరిచేతా కట్టించే విధంగా కృషి చేయవలెను. కొన్ని సందర్భాల్లో బ్యాంకు అధికారులకు కూడా కొన్ని పరిమితులూ, సమస్యలూ ఉంటాయని గ్రహించాలి. వారి సమస్యలను అర్థం చేసుకొనుటకు ప్రయత్నం చేయాలి. మన సమస్యలన్నీ ఒకేసారి తీరకపోవచ్చు. అంచెలంచెలుగా తీర్చుకొనుటకు ప్రయత్నం చేయవలెను.

→

"భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది" ఉపనిషత్తులు

ముఖ్యంగా గ్రామైక్య సంఘాలు చొరవతీసుకొని, తల్లీబిడ్డల ఆరోగ్యానికి సంబంధించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి సరియైన సేవలను అందుకొనవలెను. గర్భిణి స్త్రీలకు ఇచ్చు మాత్రలు, సూదులు మరియు కాన్పు జరిగినప్పుడు ప్రభుత్వం ఇచ్చే రూ.500/-ల పారితోషికం సక్రమంగా అందునట్లు చూడవలెను. ఏ.ఎన్.ఎం. ద్వారా వారానికి ఒక్కసారి గర్భవతులకు, చంటిపిల్లలున్న తల్లులకు ఒక ఆరోగ్య శిబిరం నడుపునట్లు ఏర్పాటు చేయవలెను. కాన్పు కష్టమయ్యే సూచనలున్న గర్భిణీ స్త్రీలను గుర్తించి, ప్రభుత్వాసుపత్రిలోని డాక్టరును సంప్రదించునట్లు ఏర్పాట్లు చేయవలెను. పిల్లలకు, తల్లులకు తగిన విధంగా పౌష్టికాహారం అందునట్లు బాలవాడి, అంగన్‌వాడి కేంద్రాల పనితీరును గ్రామైక్య సంఘం చొరవ తీసుకొని మెరుగుపరచవలెను. ముఖ్యంగా అతి బీదవారికి తగిన విధంగా సహాయం అందునట్లు జాగ్రత్తలు తీసుకొనవలెను.

గ్రామాభివృద్ధి కమిటీ, వాటర్‌షెడ్ కమిటీలు చొరవ తీవుకొని పాఠశాల పనితీరు, పశువైద్యశాల పనితీరు, వ్యవసాయ విస్తరణ, ఉద్యానవన విస్తరణ పనితీరును, నీటి వినియోగదారుల సంఘం పనితీరును, గ్రామ పంచాయితీ పనితీరును పరిశీలించవలెను. ఆ సంస్థలద్వారా జరుగుతున్న మంచి సేవలను గుర్తించి, ప్రశంసించి, లోటుపాట్లు ఉంటే ఏ విధంగా సరిచేయవలెనో ఆలోచించి, సరైన సేవలందించుటకు కృషిచేయవలెను. గ్రామంలో ఎటువంటి ప్రభుత్వ కార్యక్రమం ఎవరు అమలుచేసినా నాణ్యతగా అమలుచేయునట్లు కృషి చేయవలెను.

గ్రామాలలో సాంఘిక దురాచారాలను, దురలవాట్లను నిషేధించవలెను. అంటరానితనం, జూదం, త్రాగుడు, దొంగతనాలు, ఇతర మోసాలు మొదలగు వాటిని గ్రామాలలో అరికట్టవలెను. ఒకరి కష్టార్జితాన్ని ఇంకొకరు అనుభవించడం, దురలవాట్లకు బానిసలై కుటుంబాలను నాశనం చేసుకోవడం మొదలగునవి నివారించుటకు కృషి చేయవలెను. గ్రామంలోని అన్ని మతాలను, కులాలను, వర్గాలను సమానంగా గౌరవిస్తూ సర్వమానవ సమానత్వాన్ని పాటించి చూపించవలెను. ఏ ఒక్కరికీ ఇంకొకరిని కించపరిచే హక్కులేదు. ప్రతి ఒక్కరూ మరొకరిని గౌరవించే సంస్కారాన్ని, సాంఘిక సమానత్వాన్ని ప్రోత్సహించాలి. ముఖ్యంగా స్త్రీలను, దళితులను గౌరవిస్తూ వారిని గ్రామాభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వాములను చేయవలెను. వాటర్‌షెడ్ గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత గ్రామ కమిటీలు తీసుకొనవలెను. గ్రామాలలో ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించుటకు, సంస్థల పనితీరు మెరుగుపరుచుటకు, బీదరికాన్ని పారద్రోలుటకు, దురలవాట్లను నిర్మూలించుటకు, సాంఘిక సమానత్వాన్ని సాధించుటకు వారిస్థాయిలో నిరంతర కృషి చేయవలెను. గ్రామంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా, సగౌరవంగా బ్రతికే పరిస్థితులు కల్పించవలెను.

ఈ దిశగా మీరందరూ కృషిచేస్తారని ఆశిస్తూ.....

మీ శ్రేయోభిలాషి,

**వై.వి. మల్లారెడ్డి**

డైరెక్టర్ - ఎకాలజి

## పెరటి తోటలలోనూ మరియు ఈ సంవత్సరం కుంట కట్టలు వేసుకొన్న రైతుల పొలాల్లోనూ కూరగాయల సాగులో పాటించవలసిన కొన్ని మెళకువలు

ప్రతి వాటర్‌షెడ్ గ్రామంలో కనీసం 50 కుటుంబాలకు చెందిన పెరటితోటల్లో కూరగాయల పెంపకాన్ని ప్రోత్సహించాలని నిర్ణయించడమైంది. ఇందులో భాగంగా నారు పోయనవసరములేని కూరగాయల విత్తనాలు అనగా బెండ, నేలచిక్కుడు, గోరు చిక్కుడు, బీర, సొర, కాకర, ముల్లంగి, పాలకూర, తోటకూర విత్తనాల్ని ఒక ప్యాకెట్టుగా చేసి, ప్యాకెట్టు ఒక్కొంటికి ధర రూ.4/- చొప్పున నిర్ణయించడమైనది. అదే నారు పోసే నాటు రకాలైన టమాటో, మిరప, మరియు వంకాయ విత్తనాల్ని గ్రామానికి 135 గ్రాముల చొప్పున సరఫరా చేసి, నలుగురు లేక ఐదు మంది రైతుల సహకారంతో నారు పోయించి, 20-25 రోజుల నారు మొక్కలు సరఫరా చేయడము జరుగుచున్నది.

ఇదే విధంగా కుంట కట్టలు వేసుకొన్న రైతుల పొలాల్లో కూరగాయల సాగు కొరకు (పాలకూర, తోటకూర, ముల్లంగి తప్ప) మిగిలిన రకాలను ఎక్కువ మోతాదుతో ప్యాకెట్టు కట్టి ప్యాకెట్టు ఒక్కటికి రూ.10/- చొప్పున ధర నిర్ణయించబడినది.

కావున రైతులు, పెరటి తోటల్లో కానీ, వామి దొడ్లల్లో స్థలమున్న వారు స్వయం సహాయక బృందాలలోనున్న మహిళలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని, కూరగాయల పెంపకం చేపట్టాలని కోరుతున్నాం.

### కూరగాయల సాగులో పాటించవలసిన కొన్ని మెళకువలు

వంకాయ, టమోట మరియు మిరప కొరకు తొలుత మడులను బాగా దుక్కిచేసి, నున్నటి ఎరువు వేసి కలియదున్ని పై విత్తనములు వేర్వేరుగా నారుపోసి 20-25 రోజులు నారు వయస్సున్న మిరపగాని వంకాయ నారు మొక్కలు 60 సెం.మీ. × 50 సెం.మీ. దూరంలో ఒక మొక్క చొప్పున నాటవలెను. టమోట నారు మొక్కలు 60 సెం.మీ. × 60 సెం.మీ. దూరంలో ఒక మొక్క చొప్పున నాటవలెను.

### నేరుగా విత్తనం పెట్టే కూరగాయలు విత్తు దూరం :

| | |
|---|---|
| బెండ | 50 × 20 సెం.మీ. |
| నేల చిక్కుడు | 60 × 30 సెం.మీ. |
| గోరు చిక్కుడు | 45 × 30 సెం.మీ. |
| బీర | 120 × 60 సెం.మీ. |
| సొర | 300 × 90 సెం.మీ. |
| కాకర | 200 × 60 సెం.మీ. |

**ముల్లంగి** : బోదెలు 45 సెం.మీ. దూరంలో ఏర్పాటు చేసి, బోదెకు ఒక ప్రక్కగా ప్రతి 20 సెం.మీ. దూరంలో రెండు రెండు విత్తనములు విత్తుకొనవలెను. మొలచిన తర్వాత రెండు మొలకలున్నచో ఒకదానిని తీసివేయవలసి ఉంటుంది.

**పాలకూర** : ఒక్కొక్క పెరటితోటకు 8 గ్రాముల విత్తనం సరఫరా చేయబడును. ఈ విత్తనం 30 చ.అ.విస్తీర్ణమునకు సరిపోతుంది. విత్తనం నాటే దూరం 20 × 5 సెం.మీ.

**తోటకూర** : ఒక్కొక్క పెరటితోటకు 1 గ్రాము విత్తనం సరఫరా చేయబడును. ఈ విత్తనం 54 చ.అ. విస్తీర్ణంలో సరిపోతుంది. విత్తనం నాటే దూరం 20 × 5 సెం.మీ.

కూరగాయల విత్తనం పెట్టే ముందుగానీ, నారుమొక్కలు నాటే ముందుగానీ నాటే స్థలం బాగా తిరగకొట్టి పెళ్ళగడ్డలు లేకుండా నలిపి, నున్నటి చీకిన పశువుల ఎరువు వేసి బాగా కలిపి చదునుచేసి విత్తడంగానీ, నాటడంగానీ చేయవలసి ఉంటుంది. క్రిమికీటకాల నియంత్రణకు రసాయన పురుగుమందులు వాడకుండా, వేప సంబంధించిన (వేపగింజల కషాయం, వేపనూనె, వేపచెక్క) పచ్చిమిర్చి + వెల్లుల్లి మరియు ఆవుపేడ + మూత్రంతో చేయదగు జీవ క్రిమికీటక నాశనులను వాడవలెను.

## ఈ మాసపు సూక్తి :

పూజకన్న నెంచ బుద్ధి నిదానంబు
మాటకన్న నెంచ మనసు ధృఢము
కులముకన్న నెంచ గుణము ప్రధానంబు
విశ్వదాభిరామ వినురవేమ !

**తాత్పర్యము :**

దేవుని పూజలకంటే నిశ్చలమైన బుద్ధి ఉండుట మంచిది. మాటలు చెప్పుటకంటే నిశ్చలమైన మనసు కలిగి యుండుట మంచిది. కులం యొక్క గొప్పతనం కంటే వ్యక్తి యొక్క మంచితనం ముఖ్యము.

**చర్చ :**

సామాజిక వాస్తవాల్ని సూటిగా స్పష్టంగా చెప్పడంలో వేమన ఆద్యుడు. జీవితంలో వేగం పెరిగి ఆలోచించడానికి గానీ, చేసిన పనులను మరియొకసారి నిదానమైన బుద్ధితో పునరాలోచించడం గానీ అవకాశంలేక ప్రతిదీ ఒక మొక్కుబడిగా జరిపే తంతుల్లో పూజలు చేయడం ఒకటి. నిజానికి పూజల ప్రయోజనం వేరు. దేవుడనేవాడు ఉన్నాడా ? లేడా ? అనే విషయం అప్రధానం. కానీ, చిత్తము, మనసు శుద్ధితో తనంతకు తాను అధికుడనే భావనలేకుండా పూజ చేయడంవల్ల మనిషిలో నిదానం, నిబ్బరం పెరుగుతుంది. చేసే కార్యకలాపాల్లో విచక్షణ పెరుగుతుంది. సాటి మనుషులను, ప్రాణులను గౌరవభావంతో, ప్రేమ, వాత్సల్యాలతో చూసి దృష్టి అలవడుతుంది. ఐతే ఇవన్నీ వదిలేసి, పూజాది కార్యక్రమాలు యాంత్రికంగా చేసిన తప్పులకు పరిహారం అన్నట్లుగా చేస్తే అట్టి పూజలు మంచిని పంచకపోగా మూఢభక్తిని, దుర్గుణాల్ని అందిస్తాయి. అందుకే దేవుణ్ణి పూజించేముందు, మన బుద్ధిని స్వాధీనంలో పెట్టుకొమ్మని వేమన సూచిస్తున్నాడు. మాటలకంటే మనస్సును అదుపులో ఉంచుకోవడం అవసరమని వేమన సూచిస్తున్నాడు. మనస్సు అదుపులో ఉన్నప్పుడు మాట అదుపులో ఉంటుంది. చేష్టలు అదుపులో ఉంటాయి. కులం కంటే గుణం ప్రధానమని వేమన ఆనాడే చెప్పినా, దురదృష్టవశాత్తూ అధునాతన సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందుతున్న దశలో కూడా కుల తత్వం ఇంకా పనిచేస్తుండటం దురదృష్టకరం. ఈనాడు జిల్లాలో ఫ్యాక్షన్ రాజకీయాలకు, తమ మనస్సులో ఉన్నటువంటి హింసాయుత ధోరణులను మొత్తం జిల్లా అంతటికీ వ్యాపింపచేస్తున్నవారు అగ్రకులాలని చెప్పుకుంటున్నవారే. ఆయా కులాల్లో ఉన్నవారందరూ దుర్మార్గులే అని చెప్పడం న్యాయంకాదు కానీ, ఈనాడు పెత్తనం చెలాయిస్తున్న ఈ కొద్దిమంది మాత్రం ఈ వర్గాలకు చెందినవారే. ఒకప్పుడు గ్రామాలలో సాంఘిక వాతావరణాన్ని, శాంతిని కాపాడడానికి కృషిచేసిన కులాలకు చెందిన వారే నేడు గ్రామాలలో నిప్పులు రాజేస్తుండటం గమనిస్తున్నాము. సమాజ శ్రేయస్సుకు, తోటి మానవుల బాగోగుల గురించి ఆలోచించక, వ్యక్తిగత స్వార్థచింతన కోసం మొత్తం సమాజాన్ని కలుషితం చేస్తున్నవారెవరైనా సరే అట్టివారిని మనం అధములుగానే పరిగణించాలి. ఎవరైతే సమాజహితం కోసం, మానవ కళ్యాణం కోసం తాపత్రయపడుతూ ఉంటారో అటువంటి వారు ఏ కులానికి చెందినవారైనా కూడా గొప్పవారే, గౌరవ మర్యాదలు పొందడానికి అర్హులే.

మీ శ్రేయోభిలాషి,

**వై. వి. మల్లారెడ్డి**

డైరెక్టరు - ఎకాలజి

## ఈ మాసంలో వ్యవసాయం

### మెట్ట రైతును ఆదుకునే అటవీ వ్యవసాయం

రాష్ట్రంలో రైతాంగం పలు సమస్యల విషవలయంలో చిక్కి విలవిలలాడుతోంది. దీనికి తోడు భూసారం, భూగర్భజల వనరులు క్షీణించడంతో వ్యవసాయం గిట్టుబాటు కావడంలేదు. మెట్ట ప్రాంతాల్లో పరిస్థితి మరింత దుర్భరంగా ఉంది. రైతులు కరువు బారినుండి తప్పించుకునేందుకు పట్టణాలకు వలసలు పోతున్నారు. రుణ సౌకర్యం, విస్తరణ సేవలు అంతంతమాత్రంగా అందుతున్నాయి. వర్షాభావ ప్రాంతాల్లో ప్రజలకు ఊరటనిచ్చే ప్రభుత్వ పథకాలు కంటితుడుపు చర్యలుగానే అమలవుతున్నాయి. ఇప్పటిదాకా మెట్ట ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడిన చక్కని ప్రభుత్వ పథకం వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమమొక్కటే అని చెప్పవచ్చు. దీనిలోనూ రైతుల భాగస్వామ్యం ఏ మేరకు ఉందో తెలియదు. మెట్ట రైతుల ఇబ్బందులను తగ్గించి గ్రామాల సుస్థిర అభివృద్ధికి తోడ్పడే సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతోనే చేపట్టాలి. అలాంటి కార్యక్రమాల్లో ఒకటిగా అటవీ వ్యవసాయాన్ని విస్తృతంగా చేపట్టవచ్చు ఈ అటవీ వ్యవసాయాన్ని ప్రయోగాత్మకంగా అమలుపరిచి, దాని సత్ఫలితాలను చవిచూస్తున్న మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తి సమీపంలోని 'నందిమల్లగడ్డ' గ్రామ రైతుల అనుభవాలను వివరించడమే ఈ వ్యాసం ఉద్దేశం.

**అటవీ వ్యవసాయమంటే...**

ఉన్న భూమిలో పంటలు, పశువులతోపాటు చెట్లను కూడా పెంచుకోవటాన్నే 'అటవీ వ్యవసాయ'మని అంటారు. ఇది చాలా వరకు సమగ్ర వ్యవసాయంలాంటిదే. ఇది మన మెట్ట ప్రాంతాలకు కొత్తేమీ కాదు. పూర్వం వ్యవసాయం అంతా ఇలానే ఉండేది. అందుకే కరువు కాలంలో కూడా రైతులు నిలబడగలిగేవారు. నానాటికీ పశువులు, చెట్ల సంఖ్య తగ్గిపోతోంది. కేవలం కొన్ని పంటలకే పరిమితం అయిపోతున్నారు. దీనికి కొన్ని కారణాలు ఉన్నాయి. కరువు కాలంలో పశువులకు మేతలేదనీ, కొన్ని చెట్లు అమ్మితే కొంత ఆదాయం పొందవచ్చని ఇలా అమ్మేస్తున్నారు. కానీ తిరిగి చెట్లను నాటటంలేదు. ఒక వేళ నాటినా గొర్రెలు, పశువులు తినేస్తాయనీ, వేసవిలో నీరు ఇవ్వలేమనీ అనుకుంటున్నారు. తిరిగి పాత పద్ధతిలో అంటే అటవీ వ్యవసాయాన్ని తక్కువ వర్షపాత మెట్ట ప్రాంతాల్లో చేపట్టాల్సిన అవసరం ఉంది. దీనివల్ల కరువు కాలంలో కూడా కనీస ఆదాయాన్ని పొంది రైతు తన జీవనోపాధికి ఇబ్బందిపడకుండా ఉండవచ్చు. దీనివల్ల చాలా లాభాలు ఉన్నాయి. కొన్నింటి గురించి తెలుసుకుందాం.

1. చెట్లనుంచి పండ్లు, కలప, పశువులకు మేత, భూసారానికి పచ్చిరొట్ట, వంటకు కట్టెలు పొందవచ్చు.
2. వర్షపు నీరు చెట్లమీద పడి తర్వాత భూమి మీదకు పడటంవల్ల నీరు భూమిలోకి బాగా ఇంకుతుంది. నీరు, భూసారం కొట్టుకుపోకుండా చెట్లు కాపాడుతాయి. గాలివల్ల కూడా సారవంతమైనమట్టి కొట్టుకుపోదు.
3. చెట్ల నుంచి రాలిన ఆకులు, భూమిలోని నీరు త్వరగా ఆవిరికాకుండా కాపాడుతాయి. తర్వాత అవి కుళ్ళి భూమి సారవంతం అవుతుంది.
4. వర్షాకాలానికి ముందూ, తర్వాత పడే వర్షపు నీటిని చెట్లు సద్వినియోగం చేసుకుంటాయి. చెట్ల వేర్లు భూమి లోపలి పొరల్లోని నీటిని, పోషకాలను తీసుకొని బతకగలవు.
5. చెట్లు వాతావరణం కలుషితం కాకుండా ఉంచడమేగాక, వాటినుంచి వచ్చిన పండ్లు రైతు కుటుంబానికి సమీకృత పోషక ఆహారాన్ని అందిస్తాయి. దానివల్ల ఆరోగ్యం దెబ్బతినకుండా ఉంటుంది.
6. రైతుకు సంవత్సరం పొడవునా తన పొలంలో పని ఉండటమేకాక అదనపు ఆదాయాన్ని ఇస్తుంది. ముఖ్యంగా ఇతర పంటలనుంచి ఆదాయం ఉండని వేసవి కాలంలో చెట్లద్వారా కొంత ఆదాయం సమకూరుతుంది.

ఇన్ని ఉపయోగాలున్న ఈ పద్ధతిని కర్నాటక, మహారాష్ట్రల్లోని కొన్ని గ్రామాల్లో అనుసరిస్తున్నారు. కాని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేపట్టడంలేదు. కారణమేమిటంటే చెట్లు ఉంటే పంట పండదు. వానాకాలం తర్వాత గొర్రెలు, పశువులు తినేస్తాయి. వేసవి కాలంలో నీరు ఇవ్వలేము అనే దృక్పథంలో రైతులు ఉన్నారు. ముఖ్యంగా తెలంగాణా జిల్లాల్లో వర్షాకాలం పంట కాగానే గొర్రెలను, పశువులను చెలకల్లోకి యధేచ్ఛగా విడిచిపెట్టేస్తారు. వేసవికాలంలో మనుషులకు, పశువులకు తాగడానికే నీరుండదు. మరి మొక్కలకు ఎక్కడ నుంచి నీరు ఇవ్వాలనే ధోరణివల్ల కూడా అటవీ వ్యవసాయాన్ని చేపట్టలేకపోవడం జరుగుతోంది.

ఆంధ్రప్రదేశ్ నెదర్లాండ్స్ బయోటెక్నాలజీవారి ఆర్థిక సహాయంతో కేంద్రీయ మెట్ట →

పంటల పరిశోధనా సంస్థవారి సాంకేతిక సహాయంతో అనావృష్టి ప్రాంత అభివృద్ధి సంస్థ అనే స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో నందిమల్లగడ్డ గ్రామంలో అటవీ వ్యవసాయాన్ని చేపట్టటం జరిగింది. ఈ కార్యక్రమాన్ని 2000 సంవత్సరంలో మొదలుపెట్టి 2003లో పూర్తి చేశారు. **ఆ గ్రామం రైతుల భాగస్వామ్యంతో నేడు రాష్ట్రం మొత్తానికి ఆదర్శ గ్రామంగా రూపొందుతోంది.** మరి ఆ గ్రామంలో అటవీ వ్యవసాయాన్ని ఎలా చేపట్టారు, ఏయే అడ్డంకులను దాటాల్సివచ్చింది. దానివల్ల ఎలాంటి లాభాలు పొందుతున్నారు తదితర అంశాలు తెలుసుకుందాం.

## నందిమల్లగడ్డ గ్రామంలో అటవీ వ్యవసాయం :

ఈ గ్రామం మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తికి 5 కిలోమీటర్ల దూరంలో ఉంది. అటవీ వ్యవసాయం గురించి ఈ గ్రామ ప్రజలకు చెప్పినపుడు, ఇది మాతో సాధ్యంకాదు. పశువులు, గొర్రెల నుంచి మొక్కలను కాపాడుకోవటం మావల్లకాదని చెప్పడం జరిగింది. గ్రామస్థుల్లో మార్పు తీసుకురావటానికి స్వచ్ఛంద సంస్థవారు అటవీ వ్యవసాయం గురించి విపులంగా వారికి తెలియజేశారు. దీని గురించి గ్రామస్తులు పదే పదే చర్చించుకొన్నారు. గ్రామ సమావేశాల్లో మాట్లాడుకుని, ఏదో ఒక కార్యక్రమం వచ్చింది కదా అని ఒప్పుకోవడం జరిగింది. కానీ వాళ్లలో ఈ అటవీ వ్యవసాయాన్ని పట్టుదలతో చేయాలనే తలంపు దానివల్ల మంచి లాభాలు పొందవచ్చుననే నమ్మకం మాత్రం ఈ అటవీ వ్యవసాయాన్ని విజయవంతంగా చేపట్టిన గ్రామానికి వెళ్ళి వచ్చిన తర్వాతనే కలిగాయి. కొందరు రైతులను అటవీ వ్యవసాయం చేపట్టిన కర్నాటక రాష్ట్రంలోని గ్రామాలకు తీసుకెళ్ళి చూపారు. అక్కడి రైతులతో మాట్లాడి, దీని లోని లాభనష్టాల గురించి తెలుసుకోవటానికి అవకాశం ఏర్పడింది. అక్కడికి వెళ్ళి వచ్చిన తర్వాత 60 మంది రైతులు ఈ అటవీ వ్యవసాయాన్ని చేపట్టడానికి ముందుకు వచ్చారు. మొత్తం 125 ఎకరాలను ఎన్నుకోవడం జరిగింది. అది కేవలం రెండు చోట్ల, అంటే ఒక్కొక్కచోట 50-60 ఎకరాలు ఉండేటట్లు ఎన్నుకోవటం జరిగింది. దీనివల్ల మొక్కలను పశువులు, గొర్రెల నుంచి కాపాడుకోవటం తేలికయ్యింది.

## గుంతలు తీయడం, నింపడం :

రైతులందరూ సమావేశమై ఏయే మొక్కలు వేసుకోవాలి, గుంతలు ఎప్పుడు తీయాలి. ఎన్ని తీయాలి, మొక్కలు ఎక్కడ నుంచి తెచ్చుకోవాలి అనే విషయాలు సాంకేతిక నిపుణులతో చర్చించారు. చెట్ల నీడవల్ల పంటకు నష్టం వాటిల్లకుండా మొక్కకు మొక్కకు 10 మీటర్లు, వరసకు వరసకు 20 మీటర్ల దూరం ఉంచుతూ, వరుసలు తూర్పు నుంచి పడమటికి వచ్చేటట్లు వేసుకోవటానికి నిర్ణయించటం జరిగింది. నిపుణుల సలహా మేరకు 2000 సంవత్సరం వేసవి కాలంలోని 2-3 అడుగుల లోతు, వెడల్పు ఉండేటట్లు గుంతలు తీశారు. గుంతలను 10-20 రోజులపాటు ఎండకు బాగా ఎండేటట్లు చేయడంవల్ల చీడపీడలు నశిస్తాయని తెలపడంతో అలా చేశారు. గుంతలను పైమట్టితో పాటు 4-5 గంపల పెండమట్టి లేదా వర్మికంపోస్టును కలిపి పూడ్చారు. ఈ గ్రామంలోని నేలలు చల్కా దుబ్బ (ఇసుక) నేలలు కాబట్టి బయటి నుంచి చెరువుమట్టి లేదా ఒండ్రుమట్టిని కొంత కలపడం జరిగింది. వీటితోపాటు ఒక కిలో వేప పిండి, 100 గ్రా. డి.ఎ.పి., 50 గ్రాముల పురుగు మందు (పొడిరూపంలో ఉండేది) కలిపి గుంతలు నింపడం జరిగింది. మొదటి వర్షాలకు గుంతలోని మట్టి గట్టిపడి మొక్కలు నాటడానికి వీలుగా తయారయ్యాయి.

## పొలం చుట్టూ వేసుకొనే మొక్కలు పెంచుకోవటానికి-కిసాన్ నర్సరీలు

నీటివసతి ఉన్న కొందరు రైతులు బావుల దగ్గర పొలంచుట్టూ వేసుకొనే మొక్కల నర్సరీని పెంచుకోవడం జరిగింది. ఈ నర్సరీల్లో సుబాబుల్, గ్లైరిసీడియా, గోరింటాకు, గచ్చకాయ, గురివింద, చీమచింత, కానుగ, మునగవంటి మొక్కల పెంపకం చేపట్టారు. దీనివల్ల రైతుకు మొక్కలతో అవినాభవ సంబంధం ఏర్పడింది.

**చెలకల్లో వేసుకున్న మొక్కలు :** పొలంలో వేసుకొనే మొక్కల ఎంపిక, మంచి మొక్కలు తెచ్చుకోవడం గురించి గ్రామ రైతులు సమావేశమై నిపుణులతో చర్చించుకున్నారు. ఏయే మొక్కలు వేసుకుంటే మంచిదనే విషయాన్ని కూడా మాట్లాడుకోవడం జరిగింది. ఎక్కువమంది రైతులు కోరుకున్నవి మామిడి, బత్తాయి, జామ, దానిమ్మ. నీటిఎద్దడిని తట్టుకుని కఠినమైన వాతావరణంలో కూడా పెరిగే సీతాఫలం, చింత, ఉసిరి, రేగులాంటి మొక్కలను కూడా వేసుకోమని నిపుణులు ఇచ్చిన సలహాల మేరకు వాటిని ఎంచుకోవడం జరిగింది. ఈ మొక్కలు ఎక్కువ సంఖ్యలో దొరికే నర్సాపూర్‌కు కొందరు రైతులు వెళ్ళివచ్చారు. తొలకరివానలు రాగానే మంచి మొక్కలను తెచ్చుకొని తయారుగా ఉన్న గుంటల్లో నాటారు.

చెలకల (పొలం) చుట్టూ మాత్రం చిన్న చిన్న గుంతలు తీసుకొని కిసాన్ నర్సరీల్లో పెంచుకొన్న మొక్కలతోపాటు టేకు, కుంకుడు, వేప, కానుగ, గోరింటాకు, చిల్లకంప మొక్కలను కంచె కోసం వేసుకున్నారు.

## పశువులు, గొర్రెల నుంచి కాపాడుకోటానికి చేపట్టిన చర్యలు

గ్రామ రైతులందరూ సమావేశమై ఈ అంశం చర్చించుకున్నారు. అందరూ ఒక తీర్మానం చేసుకున్నారు. తీర్మానం ప్రకారం ఏ ఒక్క మొక్కనైనా ఎవరి జీవమైనా నష్టపరిస్తే దానికి 500 రూపాయల జరిమానా చెల్లించాలి. దీంతో గ్రామస్థులంతా ముందు జాగ్రత్తలు తీసుకొని వారి వారి జీవాలను దగ్గరుండి వారి చెలకల్లోనే మేపుకోవడం చేపట్టారు. ఈ అటవీ వ్యవసాయం **ఈ గ్రామంలో ప్రస్తుతం ఇంత చక్కగా అమలు కావడానికి దోహదపడిన విషయం గ్రామస్తులంతా ఆ తీర్మానానికి కట్టుబడి ఉండటమే.**

**పంటలు :** గ్రామంలో ఇంతకుముందు పండించుకునే ఆముదం, కందులు, జొన్న, వేరుశనగ పంటలు మామూలుగానే పండించుకుంటున్నారు. కాకపోతే చెట్ల మొదలు నుంచి కొంచెం స్థలం విడిచిపెడుతున్నారు.

**మొక్కలకు నీరందించడం :** వర్షాకాలం పంటలు కాగానే నీటి ఎద్దడి మొదలయ్యింది. బోరుబావులు ఉన్నవారికి కొంత మొత్తం చెల్లించి నీరు తీసుకోవడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఎడ్లబండ్లపైన 2-4 పీపాలను అమర్చి మొత్తం 125 ఎకరాలకు నీటిని ఇచ్చి కార్యక్రమాన్ని రైతులందరూ సామూహికంగా చేపట్టారు. ఈ విధమైన పనులతో రైతులు సంవత్సరం పొడవునా తమ చెలకల్లో ఉంటూ మొక్కలను జాగ్రత్తగా చూసుకున్నారు.

**రెండు మూడేళ్లలో చేపట్టిన కార్యక్రమాలు :** చనిపోయిన మొక్కలకు బదులు మళ్ళీ నర్సరీల నుంచి తెచ్చుకొన్న మొక్కలు నాటుకోవడం రెండో సంవత్సరం (2002) వానాకాలంలో చేపట్టారు. వేసవి కాలంలో నీరు ఇస్తూ, జీవాలనుంచి కాపాడుకుంటూ ఉన్నారు. మూడో సంవత్సరం (2003)లో వచ్చిన పూతను తీసివేయడంవల్ల చెట్లు దృఢంగా పెరిగాయి.

**సాధించిన ఫలితాలు :** నాలుగు సంవత్సరాల వయసు వచ్చిన మామిడి చెట్లు 2004లో సరైన వర్షాలు లేక పంటలు పండని కాలంలో కూడా బాగా కాయలు కాశాయి. గ్రామంలోని ప్రతి రైతూ తన చెట్లనుంచి ఎకరానికి 1000-2000 రూపాయల అదనపు ఆదాయాన్ని పొందాడు.

**కొందరు రైతుల వివరాలు :** ఈ ఆదాయంతోపాటు పంటకు ఉపయోగపడు కట్టెలు, పశువుల మేతకు సుబాబుల్ ఆకులు, భూమికి బలాన్ని ఇచ్చే గ్లైరిసీడియా పచ్చిరొట్టగా ఉపయోగపడ్డాయి. ఈ చెట్లు ఉన్నందువల్ల రోజూ చెలకల్లోకి పోయి వేసవికాలంలో వేరే చెట్లు కూడా నాశనం కాకుండా కాపాడుకుంటూ ఉన్నందువల్ల గ్రామంలో చెట్ల సంఖ్య బాగా పెరిగింది. వాతావరణం కూడా చాలా మెరుగుపడింది. గ్రామంలో రైతులు పట్టణాలకు వలసలు పోవాలనే ఆలోచన లేకుండా తమ పొలంలోనే సంవత్సరం పొడవునా, చెట్లను పెంచుకుంటూ, పశువులను కాసుకుంటూ సంతోషంగా ఉన్నారు. ఈ సంవత్సరం అంటే 2005 వేసవిలో ఎకరానికి సగటున 2000-4000 రూపాయల అదనపు ఆదాయం చెట్ల పండ్లు అమ్ముకుంటే వస్తాయనే ధీమాతో ఉన్నారు.

**ఇతర మెట్ట ప్రాంత రైతులకు సందేశం :** నందిమల్ల గడ్డ గ్రామ రైతులు అటవీ వ్యవసాయాన్ని మెట్ట ప్రాంతాల్లో చేపట్టవచ్చుననీ, కరువు కాలంలో కూడా కనీస ఆదాయాన్ని చెట్ల నుంచి పొందవచ్చుననీ రైతు జీవనోపాధికి గ్రామాలను విడిచి పట్టణాలకు వలస పోనవసరంలేదనీ నిరూపించారు. మన రాష్ట్రం మొత్తానికి అటవీ వ్యవసాయాన్ని మొట్టమొదట చేపట్టిన గ్రామం నందిమల్లగడ్డ. ఇతర గ్రామాల నుంచి రైతులు ఈ గ్రామానికి వచ్చి అటవీ వ్యవసాయాన్ని చూసి, దానిలోని సాధక-బాధకాలను తెలుసుకొని వెళ్తున్నారు. ఇందువల్ల మనం తెలుసుకున్నదేమిటంటే, రైతుల భాగస్వామ్యంతో మెట్టప్రాంతాల్లో అటవీ వ్యవసాయాన్ని చేపట్టవచ్చు.

ఈ పద్ధతిని అవలంబించినందువల్ల రైతుల సమస్యలన్నీ తీరిపోతాయని మాత్రం కాదు, కానీ దీనివల్ల కరువు నుంచి కొంత వెసులుబాటు లభిస్తుంది.

**మెట్ట ప్రాంతంలో కరువు పరిస్థితులను తట్టుకోవడానికి చేపట్టవలసిన సమగ్ర కార్యక్రమాల్లో అటవీ వ్యవసాయం చాలా ముఖ్యమైనది.**

(అన్నదాత, జూన్ 2005)

**ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.**

**☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990**